




*వివాహ వేడుక విధివిధానంలో పాటించవలసిన సాంప్రదాయాలు, ఆచారాలతో పాటు 'వధువు అలంకరణ' కూడా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. బ్రహ్మస్థానమైన నుదిటి పై వివాహిత ప్రతిదినం కుంకుమ దిద్దితే.. భర్త ఆయుష్షు పెరుగుతుందని, శుభాలు కలుగుతాయని చెబుతుంది మన సంస్కృతి.*

*ఆచార సాంప్రదాయాలని అనుసరించి పాణీగ్రహణ సమయంలో ఉచ్ఛరించిన పెళ్లి ప్రమాణాలు 'పదికాలాల పాటు నిలబడతాయని, వైవాహిక జీవితం అన్యోన్యంగా సాగుతుందని సూచిస్తుంది మన సాంప్రదాయం.*

★★

*విభిన్న కుటుంబ నేపథ్యాల నుండి భిన్న మనస్తత్వాలు కలిగి ఉన్న ఐదుగురు అమ్మాయిల గురించి, వారినడుమనున్న మైత్రి బంధం గురించి, వారి ఆశలు, ఆశయాల గురించి సాగుతుంది*

***'కళ్యాణతిలకం'** నవల లోని కథనం.*

*వారి వైవాహిక జీవితాల్లోని ఆనందాలు, వైఫల్యాలు, అరమరికలు, అనురాగాల గురించి సాగుతుంది ఇతివృత్తం*

*ఒకరిది తీర్చలేని వ్యథ, ఒకరి జీవితం ఆనందాల డోలిక, ఒకరి కాపురం కష్టాల కాష్టం, మరొకరిది నిత్యవసంతం గా సాగే సంసారం, వేరొకరికి 'కళ్యాణం' కరిగిపోయే కల.*

*ఐదుగురు అతివల జీవన గాథలని ప్రతిభంబించేదే 'కళ్యాణతిలకం' నవల.*

(గత సంచిక తరువాయి)

**"హలో బావగారు!** మీ లైఫ్ జోరుగా హుషారుగా సాగుతున్నట్టున్నదే? నేనేదో చిన్న షాపింగ్ కోసం వస్తే ఇలా 'బెస్ట్ కపుల్' నాకు ఎదురుపడ్డం పెద్ద అదృష్టమే. ఇంతకీ ఏమిటి విశేషం?" అని అరుణ్ తో అంటూ క్షణమాగింది.

"ఎదుట మనిషిని 'హలో' అని కూడా చెప్పనివ్వకుండా నీ వాగుడే వాగుడా? నీలో మార్పు రాలేదని అర్ధమయింది. ఇంతకీ ఎలా ఉన్నావు? అంతా ఓకే కదా! నీకెప్పుడైనా సరే మళ్ళీ నీ ఉద్యోగం కావాలంటే మన మ్యానేజ్మెంట్ తో మాట్లాడు. ఇకపోతే, ఇవాళ మా పెళ్లి రోజు. కళ్యాణి కి గిఫ్ట్ తీసుకుందామని వచ్చాము." అంటూ ఆమె మాటలకి అరుణ్ అడ్డకట్ట వేసారనిపించి నవ్వుకున్నాను.

"అవునులే బావా! నీ నుండి కానుకలు అందుకునేవాళ్ళు అదృష్టవంతులే. ఏమైనా నీ భార్యామణి నీ ప్రేమలో మునిగి తేలుతున్నట్టుంది. సంతోషమే!

ఇక నా ఉద్యోగమంటావా? చాలా బాగుంది. మా అమ్మ కూడా చికిత్స తరువాత వ్యాధి నుండి బాగానే కోలుకుందని మీ అమ్మానాన్నలకి చెప్పు. వస్తా.” అంటూ గబగబా వెళ్ళిపోయింది.

కొన్న వస్తువులకి డబ్బు కట్టి మేము అక్కడినుండి బయలుదేరిపోయాము.

మరునాడు శనివారం గుడికి వెళ్ళి రాగానే ఎప్పటిలా వంటపనిలో మునిగిపోయారు అత్తమ్మ. అరుణ్ కి, మామయ్య కి ఇష్టమైన ఆవడలతో పాటు ఆలూబోండా, అరిసెలు కూడా చేసారామె.

లంచ్ సమయానికి అరుణ్ వచ్చాక, ఆయనకి వడ్డిస్తూ హితబోధ చేయసాగారు అత్తమ్మ. అదీ స్త్రీలు సున్నితులని చెబుతూ... “అంతెందుకు? నీ భార్య ఎంతటి సుకుమారో తెలుసా! తోటలో పనిచేస్తేనే ఆ అమ్మాయి చేతులు కందిపోతున్నాయి. ఆ నాజూకు పిల్లతో నాజుగ్గానే మసులుకోవాలి”, “అందుకే, అన్నిటికీ పనివాళ్ళని పెట్టుకొమ్మని చెప్పేసాను కళ్యాణికి. ఇలా కాఫీలు అందివ్వడానికి కూడా.” అన్న ఆమె మాటలకి నవ్వుతూ నా నుండి కాఫీకప్పు అందుకున్నారు అరుణ్.

ఏమైనా, అరుణ్ తో ఉన్నప్పుడు నేనే అప్రమత్తంగా మెలగడం అలవరచుకుంటున్నాను. నా మనస్సుని నిశ్చలంగా ఉంచుకోవాలని ప్రయత్నిస్తున్నాను. నా భర్తతో జీవనాన్ని సంతోషకరంగా మలుచుకునేందుకు గట్టి ప్రయత్నమే ఆరంభించాలని నిశ్చయించుకున్నాక, ఎక్కడ ఎలా మొదలు పెట్టాలా అని ఆలోచించాను.

అన్ని సమయాల్లో, ముందు నా జడని అందిపుచ్చుకుంటారు అరుణ్. ఇకపై అతనికి ఆ అవకాశం లేకుండా చేయాలన్న ఉద్దేశంతో... పొద్దున్నే జుత్తు పొట్టిగా కత్తిరించి ముడి వేసుకొన్నాను. ‘ఇకపై నా జుత్తు లాగుతాడేమో అన్న బెరుకు తప్పినట్టే’ అనుకుంటూ కిందికి వెళ్ళి వంటింట్లో అత్తమ్మకి సహాయం చేయబోయాను.

“అదేమిటి కళ్యాణి? అంత చక్కని జుట్టుని అలా కత్తిరించేసావు? అన్నారామె ఆశ్చర్యంగా నా వంక చూసి. “పైగా ముసలావిడిలా ఆ ముడి ఏమిటి?” అన్నారు కూడా కోపంగా.

ఏమనాలో తోచక మౌనంగా ఉండిపోయాను. ఆమె అంతలా నొచ్చుకుంటారనుకోలేదు. ఆలోచిస్తే, ‘నా యీ చేష్ట అమ్మకైనా నచ్చదు.’ అనిపించింది.

“మరోసారి ఆ పని చేయకమ్మా! చక్కని నీ తలకట్టు, పొడవాటి నీ జడ నీకెంత అందాన్నిస్తాయో తెలుసా?” అంటూ బాధపడ్డారు అత్తమ్మ.

నన్ను చూడ్డానికి వచ్చినప్పుడు నా జడ చూసి ఆమె ఎంత ముచ్చట పడ్డారో గుర్తొచ్చింది. “మీ అమ్మాయికి ఇంత వత్తైన జుత్తు, చక్కని తలకట్టు ఎంతో అందాన్నిస్తాయి వదినా?” అని అమ్మతో ఆమె అనడం...

“ఆ విషయంలో కళ్యాణికి అంతా మా అత్తగారి పోలికే. పైగా కేశాలంకారణ, మేకప్ లో వాళ్ళ నాన్నమ్మ వద్ద తర్ఫీదు పొందింది ఈ మనమరాలు వదినా! ఆమెకి కళ్యాణి అంటే మహా ప్రేమ.” అంటూ అమ్మ నవ్వేయడం గుర్తొచ్చింది.

ఏమైనా అత్తమ్మని ఇక ముందెన్నడూ నిరుత్సాహ పరచకూడదని నిర్ణయించుకున్నాను.

వేవిళ్ళు మొదలయ్యాయి. మహా యాతనగా ఉంది. మునుపు ఇష్టమైన ఆహారమే కాదు. కొన్ని పూల సువాసనలు కూడా పడడం లేదు. అత్తయ్య నాకోసం శ్రద్ధగా వండించే తినుబండారాలు, తెప్పించే మామిడికాయలు, ఉసిరికాయలు తినడం మినహాయించి ఈ సమయంలో ఆహ్లాదాన్ని కలిగించే ఇష్టమైన వ్యాపకాల గురించి ఆలోచించాను.

చిన్నప్పటినుండి నాకు కుక్కపిల్లలంటే ముద్దు. స్కూలుకి వెళ్ళే దారిలో తప్పిపోయిన కుక్కపిల్లల్ని చేరదీసేదాన్ని. నానమ్మకి ఇష్టం లేదని అప్పట్లో స్నేహితులకి అప్పజెప్పేదాన్ని. సికందరాబాద్ వచ్చేశాక అలా చేరదీసిన వాటిని పెంచే స్తోమత లేక ప్రేమగా పెంచుకుంటామన్న వారికి ఇచ్చేసేదాన్ని.

మొక్కల పెంపకం, తోటపని కూడా నాకెంతో ఇష్టం. మా ఈ బంగళాకి ముందు, వెనకా కూడా ఉన్న తోటని కొత్త మొక్కలతో మరింత అందంగా చేయవచ్చు. కాక, కుక్కపిల్లల్ని కూడా బేషుగ్గా పెంచుకోవచ్చు' అనుకున్నాను.

అరుణ్ భార్యగా నాకు లభించిన గౌరవ హోదాల్లో 'ఢిల్లీ పశుసంక్షేమ' కమిటీ సభ్యత్వం ఒకటి. అయితే, కుక్కల పెంపకానికి అత్తమ్మ ఒప్పుకుంటారో లేదో అడిగి చూడాలనుకున్నాను.

మరునాడు మధ్యాహ్నం వంటింట్లో పని చేస్తున్న అత్తమ్మ దగ్గర చేరాను. నా మనసులో మాట బయట పెట్టాను.

"పెంపుడు కుక్కలంటే నాకూ ఇష్టమేనమ్మా. వెళ్ళి నీకు కావాల్సిన మంచి జాతి కుక్కల్ని రెండు కాకపోతే మూడింటిని తెచ్చుకో, మామయ్యకి కూడా ఏమీ అభ్యంతరముండదు. సరేనా?" అన్నారామె.

అత్తమ్మ ఒప్పుకున్నందుకు, నా ఆనందానికి అవధుల్లేవు. పోతే, ఇదే సరయిన సమయం గా అనిపించి ధైర్యం చేసి అత్తమ్మ ని 'తార గురించి అడిగాను.

ఆమె నా వంక నిశితంగా చూశారు. "మొన్నామధ్య జువెలరీ షాప్ లో మీకు కనబడిందని అరుణ్ అన్నాడు. తార మీ మామయ్యకి దూరపు బంధువుల అమ్మాయి. తండ్రి పోయాక, తల్లి కాన్సర్ వ్యాధి బారిన పడి ఒంగోల్ లో చికిత్స పొందుతున్న సమయంలో.. డిగ్రీ పూర్తి చేసిన తారని ఇక్కడికి పంపింది ఆమె. కూతురికి మంచి భవిష్యత్తునిమ్మని మమ్మల్ని కోరింది.

అలా ఒంగోల్ నుండి వచ్చిన తార మా ఇంట్లోనే రెండేళ్ళు ఉండి కంప్యూటర్ కోర్సులు చేసి, మన కంపెనీ లో పనిచేయసాగింది. అరుణ్ తో చనువుగా మెలిగేది. బావా! అని పిలుస్తూ వెంటే తిరిగేది. వీడు కూడా స్నేహంగానే ఉండేవాడు.

మరి ఏమయిందో గాని, మీ మామయ్య ఓ సారి గట్టిగా తారని మందలించారు. అకౌంటెంట్ స్థాయిలో ఉంటూ 'ఆఫీసు ఫండ్స్' ని చెప్పాపెట్టకుండా తన సొంతానికి తీసుకున్నందుకు నిలదీశారు. దాంతో తార కోపం తెచ్చుకుని,

మామయ్యని, అరుణ్ ని కూడా నానామాటలు అని, అవమానపడి ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంట్లోనుంచి వెళ్ళిపోయింది.

అరుణ్ మీద తార కి పీకల దాకా కోపం. వీడు కూడా మాములోడు కాదులేమ్మా. నిజం చెప్పాలంటే వాళిద్దరి నడుమ ఏదో గొడవే జరిగిందని నా భావన." అని స్పష్టంగా చెప్పారామె.

ఆమె దాపరికం లేకుండా తార గురించి వివరించడాన్ని నమ్మలేకపోయాను. మనసుకి కొంత ఊరట కలిగింది.

కుక్క పిల్లల్ని తెచ్చుకుందామని 'పశు సంక్షేమ సంస్థకి ఫోన్ చేసాను.

"ప్రస్తుతం మన వద్ద లేవు. ఏవైనా మంచివి, చిన్నవి షెల్టర్ కి వచ్చినప్పుడు తెలియ చేస్తాను. కొద్ది రోజులు సమయం ఇవ్వండి." అంది మేనేజర్.

నెలలు నిండుతుంటే, అత్తమ్మ దగ్గరే కూర్చుంటున్నాను. ఎక్కువ సమయం ఆవిడతోనే గడుపుతున్నాను. యిద్దరం కలిసి పుట్టబోయే బిడ్డకి ఫర్నిచర్ కోసం అప్పుడప్పుడు షాపింగ్ వెళ్ళడం చేస్తున్నాము.

పై అంతస్తులోని మా గదికి ఎదురుగా ఉన్న గదిని బేబీకి నర్సరీగా కేటాయించాము. నాకు ఆరోనెల రాగానే మెట్లెక్కడం కష్టంగా ఉందని క్రింద అంతస్తులోని 'గెస్ట్–రూం లోకి మారాను.

'జంతు సంక్షేమం వారి నుండి కబురందుకుని, వెళ్ళి రెండు '*డాషాండ్*' జాతి కుక్కపిల్లల్ని తెచ్చాను. టోనీ, మోని అని అత్తమ్మే పేర్లు పెట్టారు. టోనీ మగ, మోని ఆడపిల్ల. సౌమ్యంగా నడుచుకునే జాతి. మామయ్యకి కూడా నచ్చాయి.

ఇంటివెనక నీడగా, చల్లగా ఉండేలా డాగ్–హౌజ్ కట్టించి, వాటికి మెత్తని పరుపులు, ఆడుకునే బంతులు తెప్పించి అమర్చాను.

రోజూ వాటిని ఆడించడం సరదాగా ఉంది. అరుణ్ కూడా ఒకోప్పుడు నాతో పాటు కుక్కపిల్లల్ని ఆడించడం, నడిపించడం సంతోషాన్నిచ్చింది. వాటితో పార్క్ కి కూడా వెళుతుంటాము.

"ఈ జాతి కుక్కలు పెద్దగా పరుగెత్తలేవు. బాతుల్లా నేలమీదే ఉంటాయి. పొట్టి కాళ్ళతో బండగా బరువుగా అవుతాయి. మెతక రకమే." అంటూ అరుణ్, జతగా ఉండవలసిన కుక్కపిల్లల్ని, ఆడించే నెపంతో దాడికి ఉసిగొల్పడం, బంతాటతో వాటిని బాధపెట్టడం చూసాక నా సంతోషం పటాపంచలైంది.

అదేమని ప్రశ్నిస్తే, "అలాగే శిక్షణనివ్వాలి. లేదంటే, అవి కాపలా కుక్కలయ్యేది ఎలా? అని

మొండిగా ప్రశ్నించారు. అతనితో అలా వాదించి లాభం లేదని అత్తమ్మని సంప్రదించాను. టోనీ, మోని లని చూసుకొని తోటపని కూడా చేయడానికి ఇద్దరు పనివాళ్ళని పెట్టాను. రాము, జీవా. ఇద్దరూ వాచ్–మాన్ తమ్ముళ్ళు.

ఏడవ నెల రాగానే అమ్మతో సంప్రదించి, ఆమెని ఒప్పించి, తమ ఇంటనే శీమంతానికి ముహూర్తం పెట్టించారు అత్తమ్మ.

సంప్రదాయంగా మేళతాళాలతో పెద్దవాళ్ళంతా దగ్గరుండి జరిపించారు సీమంతం వేడుక.
అతిధులంతా వెళ్ళాక హాల్లో కూర్చుని ఇంటిల్లిపాదీ కబుర్లు చెప్పుకుంటుంటే... వింటూ ఉన్నాను.

"వదినా, మీరు నాకో మాటివ్వాలి." అన్నారు అత్తమ్మ ఉన్నట్టుండి అమ్మతో.

"చెప్పండి వదినా" అన్న అమ్మతో..

"గుణవంతురాలైన కళ్యాణి మా ఇంటి కోడలిగా వచ్చినా, సొంతబిడ్డలా కలిసిపోయింది. మా కోడల్ని మా అదృష్టంగా భావిస్తాము. ఇకపోతే, కళ్యాణి ప్రసవం కూడా.. మొదటినుండీ చూస్తున్న డాక్టర్ చేతుల మీదుగా ఇక్కడే కానిద్దాం వదినా! అసలు ఇకమీదట వీలైనంతమటుకు కళ్యాణి పురుళ్ళు, వేడుకలు మీ ఆశీస్సులతో ఇక్కడే జరుపుకుందాము. మీరైనా, మేమైనా... తేడా ఏముంది చెప్పండి." అడిగారు అత్తమ్మ.

అమ్మ నవ్వుతూ మౌనంగా ఉండిపోయింది.

"అదీ కాక మనింట్లో ఏ వేడుక జరిగినా మావాళ్ళు కనీసం వందమంది బంధువులు, విదేశాల నుండి
కూడా వస్తారు. చూసారుగా పెళ్ళికి ఎంతమంది వచ్చారో. మన ముచ్చట కంటే బంధువుల మర్యాదలు ఎక్కువౌతాయి. అదే పెద్ద పనైపోతుంది." అంటూ నవ్వేశారు అత్తమ్మ.

ఆ తరువాత మరో నాలుగు రోజులుండి అమ్మావాళ్ళు, తమ్ముడు వెళ్ళిపోయారు. మా టోనీ, మోని లు వాళ్ళకి కూడా నచ్చాయి.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS